సాక్షి చిత్తూరు

సోమవారం । 3 । మార్చి । 2025



గ్రంథం.. అంధకారం

కూటమి పాలనలో గ్రంథాలయాలు అలంకార ప్రాయంగా మారాయి. వీటికి సెస్ పరంగా దక్కాల్సిన నిధులు పక్కదారి పట్టాయి. - 8లో



నాడు పండుగ.. నేడు దండగ

వైఎస్సార్ సీపీ పాలనలో వ్యవసాయం స్వర్ణ యుగంలా ఉండేది. నేడు కూటమి పాలనలో రైతులకు నిరాశే మిగిలింది. - 8లో



నేటి నుంచి పోస్టల్ క్యారమ్స్..

పోస్టల్ ఉద్యోగులకు క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు నేటినుంచి తిరుపతి వేదికగా ఆల్ ఇండియా క్యారమ్స్ టోర్నీ నిర్వహిస్తున్నారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	సోమవారం (సా)	మంగళవారం (ఉ)
చిత్తూరు	6-27	5-07
పుంగనూరు	6-29	5-11

న్యూస్‌రీల్

15 నుంచి ఒంటిపూట బడులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈనెల 15వ తేదీ నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల 15వ తేదీ నుంచి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్, ప్రైవేట్, గుర్తింపు పొందిన అన్ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్‌లో ఒంటిపూట తరగతులు పక్కాగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఒంటిపూట బడులు పకడ్బందీగా అమలు చేయాలని డీవైఈవోలు, ఎంఈవోలకు ఉత్తర్వులు పంపారు. పనివేళల్లో ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో సాయంత్రం పూట తరగతులు నిర్వహించాలని సూచించారు.

మహిళా సాధికారత వారోత్సవాలు



యోగా కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు

చిత్తూరు అర్బన్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆదివారం మహిళా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో మహిళా ఉద్యోగులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. శారీరక, మానసిక ఆరోగ్యంపై యోగా శిక్షకులు వివరించారు. ఈనెల 8వతేదీ వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

భారతీయ జ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేయాలి



సదస్సును ప్రారంభిస్తున్న పీఠాధిపతులు, అతిథులు

తిరుపతి సిటీ: భారతీయ జ్ఞానం, సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయాలని శ్రీశైల పీఠం జగద్గురు డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత వర్సిటీ, బెంగళూరుకు చెందిన అఖిల భారత వీరశైవ శివాచార్య సంస్థాన్ సంయుక్తంగా వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం శక్తి విశిష్టాద్వైతం అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీఠాధిపతులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శక్తి విశిష్టాద్వైతం మహత్వాన్ని ఆధునిక దార్శనికులకు అందించడం శుభపరిణామమన్నారు. సంస్కృత భాష ఔన్నత్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాశీపీఠం జ్ఞానసింహాసనధీశులు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్యులు మాట్లాడుతూ ఎన్ఎస్‌యూలో అద్వైత వేదాంత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించి శక్తి విశిష్టాద్వైతం గొప్పతనాన్ని తెలియజేయడం అభినందనీయమన్నారు. ఇందులో సారాంశాన్ని గ్రహించి ఆధ్యాత్మిక తత్వ అన్వేషణలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సదుస్సులో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్ రజనీకాంత్‌శుక్లా, ప్రొఫెసర్ గణపతిభట్, సతీష్, నాగరాజభట్, శివరామదాయగుడే, మనోజ్‌షిండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఎస్‌బీఆర్‌పురం చెరువును గ్రావెల్‌తో పూడ్చేస్తున్న కూటమి నేత

చెరువుకు చెర!

కొండలు, గుట్టలు దోచేస్తున్నారు.. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారు. పది మందికి ఉపయోగపడే చెరువులనూ వదలడం లేదు కూటమి నేతలు.. ఈ కోవలోనే వడమాలపేట మండలంలో ఓ చెరువుపై కూటమి నేత కన్ను పడింది.. ఇంకేముంది.. పది మందికి ఉపయోగపడే చెరువును పూడ్చే పుణ్యకార్యానికి పూనుకున్నాడు ఆ గ్రామ పెద్ద.. పక్కనే ఉన్న కొండ నుంచి గ్రావెల్ తవ్వి చెరువును పూడ్చే పనులు చకచకా చేపట్టాడు.ఆ కూటమి నేత చెరువును కబళిస్తున్నాడని తెలిసినా అడ్డు చెప్పే ధైర్యం చాలక అధికారులు చేష్టలుడిగి చూస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది.

- కబ్జా కోరల్లో ఎస్‌బీఆర్‌పురం చెరువు
- జీఓ నం.188 విరుద్ధంగా చెరువును పూడ్చేస్తున్న సర్పంచ్
- సుప్రీంకోర్టు ఉత్తర్వులు బే ఖాతర్
- ఎస్‌బీఆర్‌పురం తటాకాన్ని కాపాడాలంటూ రైతులు డిమాండ్
- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

వడమాలపేట (విజయపురం) : శ్రీ వేంకటేశ్వరుని పుణ్యక్షేత్రమైన తిరుపతికి 10 కిలోమీటర్ల దూరంలో వడమాలపేట మండలం ఉంది. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న భూములకు మంచి డిమాండ్ ఉండడంతో కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు కొండలు, గుట్టలు, చెరువులు వేటినీ వదలడం లేదు. ప్రభుత్వం స్థలమంటే అధికార పార్టీకి చెందిన ఆస్తులే అన్న చందంగా రెచ్చిపోతున్నారు. ఎంత ఆక్రమించుకోగలిగితే అంత కబ్జాకు తెరతీశారు. జానెడు జాగా కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పేదవారు ఈ తంతును చూసి నివ్వెరపోతున్నారు. ఇదేం పాలనరా బాబూ అంటూ ఆవేదన చెందుతున్నారు. ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ, ఫారెస్టు భూములను ఆక్రమించుకొని మామిడి చెట్లు పెంచుకుంటున్న విషయం బహిర్గతమై రోజులు గడవక ముందే మరో ఆక్రమణ వెలుగు చూస్తోంది. వడమాలపేట మండలం, ఎస్‌బీఆర్‌పురం చెరువు కబ్జా చేయడానికి స్థానిక కూటమి నేత కంకణం కట్టుకున్నాడని, ఇప్పటికే రెండు రోజులుగా చెరువు కట్ట ఆనుకొని ఉన్న కొండలో నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించి చెరువును పూడ్చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అది తప్పని తెలిసినా అధికార పార్టీ నేత కావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటానికి సాహసించడం లేదు. ఆక్రమిత నేతకు ధన బలం, అధికారం బలం ఉండటంతో అధికారులు అది తప్పు అని చెప్పే ధైర్యం చేయలేకపోతున్నారు. ఆక్రమణకు గురవుతున్న చెరువును కాపాడాలని మాజీ నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, రైతులు కోరుతున్నారు.

జీఓ నంబరు 188కి విరుద్ధంగా ..

ఎస్‌బీఆర్‌పురం చెరువు మొత్తం విస్తీర్ణం 487 ఎకరాలు. అందులో 48 ఎకరాల చెరువు, 439 ఎకరాల మునక పట్టాలు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జీఓ నం.188 ప్రకారం చెరువులో నీళ్లు లేనప్పుడు మాత్రమే రైతులు సాగు చేయాలి. సాగు చేసిన తరువాత చెరువు నిండితే వాటిని ఎలాంటి నష్ట పరిహారం చెల్లించరు. చెరువులో నీరు ఉంటే ఆ భూములను గ్రావెల్‌తో ఎత్తు పెంచడం వంటి పనులు చేయకూడదు. ఆ జీఓకు విరుద్ధంగా అధికారి పార్టీకి చెందిన స్థానిక కూటమినేత చెరువులో నీళ్లు ఉండగానే మునక ప్రాంతంలో గ్రావెల్ పోసి ఎత్తు పెంచేస్తున్నాడు. ఇలా గ్రావెల్‌తో చెరువును పూడ్చేయడంతో లోతు తగ్గిపోయి, పూర్తి స్థాయిలో నీరు చెరువులో నిల్వ ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

35 గ్రామాలకు సాగు, తాగునీరు

ఎస్‌బీఆర్‌పురం చెరువు నిండితే సుమారు 35 గ్రామాలకు సాగు, తాగునీరు పుష్కలంగా ఉంటుంది. 20 ఏళ్లుగా తడుకు, చిరుగురాజు పాలెం, గొల్లపల్లి, తోరూరు, కొడలచెరువు, నెసనూరు, పుత్తూరు ప్రాంతాల్లో ఉన్న సాగు, తాగునీటికి ఎలాంటి కష్టాలు రాలేదంటే అది ఈ చెరువులో చేరే నీటి వల్లే అన్నది నిష్ఠూర సత్యం. అలాంటి చెరువు ఆక్రమణకు గురికావడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు చెరువును కాపాడాలి



“ఎస్‌బీఆర్‌పురం సర్పంచ్ చేస్తున్న పని చూస్తుంటే కంచే చేనును మేస్తున్నట్లు ఉంది. పంచాయతీకి సంబంధించిన భూమి, చెరువు, గుంటలను కాపాడాల్సిన సర్పంచ్ చెరువును పూడ్చేయడం అన్యాయం. 10 మందికి ఆదర్శంగా ఉండాల్సిన సర్పంచి అధికారంతో ఇలా చేయడం ఎంత వరకు న్యాయం. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఆక్రమణకు గురైన చెరువును వెంటనే స్వాధీనం చేసుకొని, గ్రావెల్‌ను బయటకు తొలగించాలి. – శ్రీనివాసులురెడ్డి, నీటి పారుదల సంఘం మాజీ అధ్యక్షుడు

అది పట్టా భూమి

రైతుల ఫిర్యాదు మేరకు మా సిబ్బంది సర్వే చేయడం జరిగింది. అది అతని పట్టా భూమి అని తెలిసింది. చెరువు నిండుగా నీళ్లు ఉండడంతో మోటారు మునిగిపోతుందని గ్రావెల్ తోలి ఎత్తు పెంచుకున్నాడు. గ్రావెల్ తరలించడానికి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. – జరీనా, వడమాల పేట, తహసీల్దార్

నోటీసు జారీ చేశాం

ఎస్‌బీఆర్‌పురం చెరువులో మొత్తం విస్తీర్ణం 487 ఎకరాలు. అందులో 439 ఎకరాలు మునక పట్టాలు. చెరువులో నీళ్లు లేనప్పుడు మాత్రమే సాగు చేసుకోవాలి. నీళ్లు ఉన్నప్పుడు మట్టితో పూడ్చడానికి ఎవ్వరికీ హక్కు లేదు. అది చట్టరీత్యా నేరం. సంబంధిత సర్పంచ్‌కి నోటీసు జారీ చేశాం. – పరశురామ్‌నాయుడు, నీటిపారుదలశాఖ ఏఈ, పుత్తూరు

ఇది రాజకీయ కక్ష కాదా బాబూ?



నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

కార్వేటినగరం : ఎన్నికలప్పుడు అందరికీ న్యాయం చేస్తామని చెప్పి తీరా పదవి వచ్చాక పార్టీలకు అతీతంగా సేవలందించాల్సింది పోయి రాజకీయంగా కక్ష గట్టి కేవలం టీడీపీకి చెందిన వారికే లబ్ధి చేకూర్చేలా సీఎం చంద్రబాబు మాట్లాడడం హాస్యాస్పదమని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గంగాధర నెల్లూరు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు వైఎస్సార్‌సీపీకి చెందిన వారికి ఎలాంటి పనులు పరోక్షంగా గాని ప్రత్యక్షంగా గాని చేయకూడదని పార్టీ నేతలు, అధికారులకు ఆదేశాలిచ్చేలా మాట్లాడడం ద్వారా తన వైఖరి ఏంటో ప్రజలకు అర్థమయిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ అయినా ప్రజలకు ఎలాంటి పనులు చేపట్టాలి.. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలనే ఆలోచన ఉండాలే తప్ప ఇలాంటి దుర్మార్గపు ఆలోచనతో నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్నాడని చెప్పారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసే ఏ కార్యక్రమమైనా సంక్షేమ పథకాలైనా పార్టీలకు అతీతంగా అందించాలని పదే పదే చెప్పేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నిరకాలుగా ఇబ్బందులకు గురి చేసినా మొక్కవోని దీక్షతో దీటుగా ఎదుర్కొంటామని తెలిపారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ వివరించారు.

వైభవం.. గిరి ప్రదక్షిణం

- ఘనంగా కొండచుట్టు మహోత్సవం
- సమస్త దేవగణాలకు వీడ్కోలు పలికిన పార్వతీపరమేశ్వరులు



గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు.. ఇన్‌సెట్‌లో స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జ్ఞానప్రసూనానాంబ సమేత వాయులింగేశ్వరస్వామివారి కైలాస గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా సాగింది. తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతా గణాలు, రుషులకు పార్వతీ పరమేశ్వరులు ఘనంగా వీడ్కోలు పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వస్వామి, జ్ఞానప్రసూనాంబదేవి ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. చప్పరాలపైస్వామి అమ్మవార్లను అధిష్టింపజేసి గిరి ప్రదక్షిణకు తీసుకెళ్లారు. రాజగోపురం నుంచి చతర్మాడవీధుల్లోకి శివపార్వతులు ప్రవేశించారు. భేరివారి మండపం వద్ద భేరికులస్తులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపజేశారు. అనంతరం జయరామారావువీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగకాలనీ, కైలాసగిరికాలనీ, రాజీవ్‌నగర్‌కాలనీ మీదుగా గిరిప్రదక్షిణ సాగింది. రామాపురం రిజర్వాయరు సమీపంలోని అంజూరు మండపంలో ఆదిదంపతులు కాసేపు సేదతీరారు. అనంతరం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయంతోపాటు పలువురు దాతలు అన్నప్రసాదాలు వితరణ చేశారు. అంజూరు మండపం నుంచి వెయ్యిలింగాలకోన, వేడాం మీదుగా శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురుసేవ మండపానికి స్వామి అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు స్వాగతం పలికారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గిరిప్రదక్షిణ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

గణనాథుడి సన్నిధి..జన సందడి



కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆదివారం భక్తజనంతో కిక్కిరిసింది. వేకువ జామున స్వామిని సుప్రభాతసేవలో మేల్కొలిపి అభిషేక, పూజలు చేశారు. ఆ తర్వాత భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. దీంతో భక్తులు క్యూకట్టారు. భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి రాత్రి వరకు జన సందడి కనిపించింది. వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా స్వామి దర్శనం కల్పించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. - కాణిపాకం

‘ఓపెన్’ బేరం



ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఓపెన్‌గా బేరం కుదిరినట్లు సమాచారం. స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్లు ఇంటర్ అభ్యర్థుల నుంచి కల్లు చెదిరే డీల్ కుదిరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి వద్ద నుంచి రూ.6 కోట్లకు పైగా డబ్బులు వసూలు అయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మాస్ కాపీయింగ్‌కు అంతా పకడ్బందీగా సిద్ధం చేశారు. ముడుపులు ముట్టజెప్పిన అభ్యర్థులకు అనుకూలమైన కేంద్రాలు.. తెలిసిన ఇన్విజిలేటర్లు పరీక్ష కేంద్రంలో ఉండేలా ప్రణాళిక రచించినట్లు వినికిడి. ఇంత పెద్ద స్థాయిలో దోపిడీకి తెరలేపడంపై ఉన్నతాధికారులకు తెలిసే ఈ బాగోతం నడిచినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

- ఓపెన్ స్కూల్ పరీక్షల మాస్ కాపీయింగ్ దందా
- ఇంటర్‌కు రూ.12 వేల నుంచి రూ.15 వేలు డబ్బుల వసూళ్లు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని స్టడీ సెంటర్‌లలో కలెక్షన్‌లు
- విద్యాశాఖ అధికారులకూ వాటాలు!
- నేటి నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూళ్లు) ఆధ్వర్యంలో 3వ తేదీ నుంచి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థుల నుంచి కొందరు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఓపెన్ స్కూళ్ల పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు బోధనా తరగతులు నిర్వహించే స్టడీ సెంటర్ల నిర్వాహకులు ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ వ్యవహారంపై చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పుమంటున్నాయి.

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3వ తేదీ నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలకు చిత్తూరు జిల్లాలో 15, తిరుపతి జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు సోమవారం నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. రెండు జిల్లాల్లో ఈ పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థుల నుంచి కొందరు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు సహకరించడానికి ఇంటర్ పరీక్షలు రాసే అభ్యర్థి నుంచి సగటున రూ.5 వేల నుంచి 10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ తతంగం మొత్తం రెండు జిల్లాల్లోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్‌లు నిర్వహిస్తున్నారు. వసూళ్ల అనంతరం విద్యాశాఖ అధికారులకు అప్పజెప్పేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

రెండు జిల్లాల్లో 6257 మంది అభ్యర్థులు..

చిత్తూరు జిల్లాలో 3419 మంది, తిరుపతి జిల్లాలో 2838 మొత్తం 6,257 అభ్యర్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఫీజు చెల్లించి స్టడీ కేంద్రాల్లో నమోదైన అభ్యర్థులు సార్వత్రిక విద్యాపీఠం నుంచి మెటీరియల్ ఇస్తారు. సెలవు రోజుల్లో స్టడీ కేంద్రాల్లో బోధనా తరగతులు నిర్వహించాలి. అయితే అలా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎక్కడా తరగతులు నిర్వహించిన దాఖలాలు లేవు. సాధారణంగా పలు కారణాలతో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లని అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతుంటారు. ఇంకా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు తమ ఉద్యోగోన్నతి కోసం ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు రాస్తున్నారు. ఇదే అదునుగా భావించిన స్టడీ కేంద్రాల నిర్వాహకులు ఒక్కొక్కరి నుంచి దాదాపు రూ.10 వేలు చొప్పున రెండు జిల్లాల్లో రూ.6.25 కోట్లు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుకూలమైన వారికి విధులు....

తిరుపతి జిల్లాలో నిర్వహించే ఈ పరీక్షల్లో తమకు అనుకూలమైన వారికి ఇష్టానుసారం పరీక్షల విధుల నియామకాలు జరిగినట్లు తెలిసింది. ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లు ఉండే సంబంధిత పాఠశాల కో ఆర్డినేటర్‌లకే విధులకు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ చేయించేందుకు అనుకూలమైన ఇన్విజిలేటర్‌లను వేయడం వివాదాలకు తావిస్తోంది.

రెండు జిల్లాల సమాచారం

చిత్తూరు జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాలు	15
తిరుపతి జిల్లాలో కేంద్రాలు	14
చిత్తూరు జిల్లాలో ఇంటర్ అభ్యర్థులు	3,419
తిరుపతి జిల్లాలో ఇంటర్ అభ్యర్థులు	2,838

అక్రమాలకు పాల్పడితే చర్యలు

చిత్తూరు జిల్లాలో ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం. ఈ పరీక్షలను కలెక్టర్ ఆదేశాల మేరకు పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుంది. ప్రతి పరీక్ష కేంద్రంలో వీఆర్‌ఓలను, ఇతర అధికారులను సిట్టింగ్ స్క్వాడ్‌లుగా ఏర్పాటు చేస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ చూచి రాతలను ప్రోత్సహించేది లేదు. జిల్లాలోని కొన్ని స్టడీ కేంద్రాలను అభ్యర్థులకు హాల్ టికెట్‌లు ఇవ్వడం లేదని ఫిర్యాదులు అందాయి. హాల్ టికెట్‌లు ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సంబంధిత స్టడీ సెంటర్‌ను బ్లాక్ లిస్టులో పెడతాం. – వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం

తిరుపతి జిల్లాలో ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. కలెక్టర్, డీఈఓ ఆదేశాల మేరకు చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాం. ఫిర్యాదులు ఏవైనా ఉన్నట్‌లైతే లిఖిత పూర్వకంగా అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇందులో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదు. – గురుస్వామిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం, తిరుపతి జిల్లా

నేటి నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఓపెన్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పరీక్షలకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నేటి నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణ చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు సమావేశం నిర్వహించి తగు సూచనలిచ్చామన్నారు. జిల్లాలో ఈ పరీక్షలకు 3,419 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌లను సంబంధిత ఏ1 సెంటర్ నుంచి లేకుంటే ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చన్నారు.

కొబ్బరికి తెగుళ్ల దెబ్బ

గుడిపాల: మండలంలో కొబ్బరి తోటలకు తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవికాలం వచ్చిందంటే కొబ్బరికి భలే డిమాండ్ ఉంటుంది. ఈ సమయంలో కొబ్బరికి తెగుళ్ల సోకడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. వరి, మామిడి, చెరకు రైతులతో పాటు కొబ్బరిసాగు రైతులు కూడా నల్లతెగుళ్లతో ఆందోళన చెందుతున్నారు. కష్టపడి సాగుచేసిన పంటలవల్ల అప్పులు మిగులుతున్నాయని కొందరు రైతులు సాగు భూమిలో సైతం కొబ్బరి చెట్లు పెంచారు. ఈ ఏడాది కొబ్బ రికాయల ధరలు అధికంగా ఉన్నా కాయలపై నల్లమచ్చలు ఉండడంతో అమ్ముడు పోవడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో శ్రీరంగంపల్లె, 189కొత్తపల్లె, వసంతాపురం, నంగమంగళం, మందిక్రిష్టాపురం, చింతగుంటూరు, కోలావూరు గ్రామాల్లో అధికసంఖ్యలో కొబ్బరిసాగు ఉంది. ఉద్యానవనశాఖ అధికారులు సరైన అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి ఆల్ ఇండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్

తిరుపతి సిటీ: దేశవ్యాప్తంగా ఉన్న పోస్టల్ ఉద్యోగుల మధ్య క్రీడాస్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో తిరుపతి వేదికగా ఆల్ ఇండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఏపీ సర్కిల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంతోష్ నేతా వెల్లడించారు. ఆయన ఆదివారం తిరుపతి డివిజనల్ పోస్టాఫీసులో విలేకరులతో మాట్లాడారు. పోస్టల్ ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది తిరుపతి మున్సిపల్ రోడ్డులోని స్మార్ట్ సిటీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం నుంచి 7వ తేదీ వరకు క్యారమ్స్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో 13 రాష్ట్రాల పోస్టల్ సర్కిల్స్ నుంచి 108 మంది పురుషులు, మహిళా ఉద్యోగులు పాల్గొంటున్నారని తెలిపారు. 7వ తేదీన జరిగే ఫైనల్‌లో విజేతలకు ట్రోఫీని అందజేస్తామని, ప్రతిభ చూపిన ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో తిరుపతి డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ బి.నరసప్ప, కర్నూల్ డివిజన్ ఏడీ వెంకటరెడ్డి, విజయవాడ సర్కిల్ డీఎస్‌పీఆర్ మూర్తి, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథం..అంధకారం

కూటమి పాలనలో గ్రంథాలయాలు అలంకారప్రాయంగా మారాయి. ఈ విజ్ఞాన భాండాగారాలకు సెస్ పరంగా దక్కాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. రూపాయిలో ఎనిమిది పైసలు గ్రంథాలయాలకు సెస్ రూపంలో చెల్లించకపోవడంతో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. ఫలితంగా గ్రంథాలయాల ఉనికి ప్రమాదంలో పడింది. జిల్లాలో దాదాపు రూ. 37 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో గ్రంథాలయాల సేవలు మొక్కుబడిగా మారాయి.



జిల్లా కేంద్ర గ్రంథాలయం

పేద విద్యార్థులకు శాపం

జిల్లాలో 71 గ్రంథాలయాలు ఉండగా నిత్యం 80 వేల మంది పాఠకులు సేవలు పొందుతున్నారు. స్థానిక సంస్థల నుంచి సెస్ సకాలంలో వసూలు కాకపోవడంతో గ్రంథాలయాల్లో అరకొరగా వసతులు ఉన్నాయి. ముఖ్యంగా పుస్తకాలు సైతం తగిన స్థాయిలో లేవని పాఠకులు అంటున్నారు. త్వరలో డీఎస్సీ పరీక్షలు ఉన్న కారణంగా జిల్లాలో వేల మంది యువత వీటికి సన్నద్ధం అవుతున్నారు. వాటితో పాటు వివిధ పోటీ పరీక్షలకు నిరుద్యోగులు సిద్ధం అవుతున్నారు. వీరిలో అత్యధిక మంది సామాన్య, పేద అభ్యర్థులే ఉంటారు. వీరంతా పోటీ పరీక్షల పుస్తకాలు, పేపర్లు కొనే ఆర్థిక స్థోమత లేక సమీపంలోని గ్రంథాలయాలకు వెళ్లి చదువుకుంటారు. కానీ అక్కడ అరకొరగా పుస్తకాలు ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- విజ్ఞాన భాండాగారాలపై బకాయిల భారం
- వసూలైన పన్నుల్లో 8 శాతం గ్రంథాలయాలకు చెల్లించాలనే నిబంధన
- పట్టించుకోని పంచాయతీ, పురపాలికలు
- సమస్యల వలయంలో విజ్ఞాన కేంద్రాలు
- ఇప్పటికే రూ.37 కోట్లకు పైగా బకాయి

చిత్తూరు కార్పొరేషన్ : విజ్ఞాన భాండాగారాలుగా పేరుపొందిన గ్రంథాలయాలు ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానిక సంస్థల నుంచి రావాల్సిన సెస్ పూర్తి స్థాయిలో వసూలు కాకపోవడంతో సమస్యలు వేధిస్తున్నాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు ఏటా ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నాయి. ఆ పన్నుల్లో నుంచి లైబ్రరీలకు చెల్లించాల్సిన సెస్ వాటాను మాత్రం సక్రమంగా జమ చేయడంలేదు. నిబంధనల ప్రకారం స్థానిక సంస్థలు వసూలు చేసిన పన్నుల్లో నుంచి 8 శాతం గ్రంథాలయాలకు సెస్‌గా చెల్లించాలి. ఈ నిబంధన అమలుకు నోచుకోకపోవడంతో గ్రంథాలయాలు ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందించలేకపోతున్నాయి. సెస్ బకాయి ఏటా పెరుగుతూ దాదాపు రూ.37 కోట్ల వరకు చేరాయి. ఈ బకాయిలు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టినా ఫలితం కనిపించడం లేదు.

రూపాయికి 8 పైసలు సెస్

ఉమ్మడి జిల్లాలో నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, పంచాయతీల పరంగా గ్రంథాలయ సంస్థకు సెస్ చెల్లింపులు జరగడంలేదు. ఈ బకాయిలు రూ.37 కోట్లకు చేరాయి. 2015-16 నుంచి బకాయిలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థానిక సంస్థలు వసూలు చేసిన పన్నుల్లో రూపాయికి ఎనిమిది పైసల చొప్పున గ్రంథాలయ సంస్థకు సెస్ చెల్లించాలి. కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు కూడా ఇదే నిబంధనను అనుసరించాలి.

సెస్ ద్వారా వచ్చిన సొమ్ముతో గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు పుస్తకాలు, మ్యాగజైన్లు, దిన, వార, మాస పత్రికలను పాఠకులకు అందుబాటులో ఉంచే వీలు ఉంటుంది. సెస్‌లో కొంత మొత్తమే జమ చేయడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో బకాయిలు ఇలా..

తిరుపతి నగరపాలక సంస్థ రూ.26.63 కోట్లు, చిత్తూరు నగరపాలక రూ.5.90 కోట్లు, శ్రీకాళహస్తి రూ.1.29 కోట్లు, నగరి మున్సిపాలిటీ రూ.42 లక్షలు, కుప్పం మున్సిపాలిటీ రూ.13 లక్షలు, పుంగనూరు మున్సిపాలిటీ రూ.11.05 లక్షలు, పంచాయతీల పరంగా రూ.2.50 కోట్లు కలిపి మొత్తం రూ.37 కోట్లు వరకు రావాల్సి ఉంది. వీటి వసూళ్లకు చర్యలు చేపడుతున్నట్లు గ్రంథాలయ అధికారులు చొరవ తీసుకుంటున్నా ఫలితం దక్కడం లేదు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుతున్న పాఠకులు (ఫైల్)

పూర్తి స్థాయి మెటీరియల్ లేదు



స్థానిక సంస్థలు సెస్ సకాలంలో పూర్తిగా చెల్లించాలి. అప్పుడే గ్రంథాలయాలకు అన్ని సౌకర్యాలు సమకూరుతాయి. పాఠకులతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు లైబ్రరీలను ఆశ్రయిస్తుంటారు. కానీ నేడు లైబ్రరీల్లో అరకొరగా వసతులు ఉంటున్నాయి. పూర్తి స్థాయి మెటీరియల్ ఉండడం లేదు.

– భరత్ , విద్యార్థి

అసంతృప్తిగా ఉంది



డిగ్రీలు, టీటీసీ, బీఈడీల అనంతరం చాలా మంది యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతారు. పేద విద్యార్థులు పుస్తకాలు అన్నీ కొనుగోలు చేయలేరు. వారు సమీపంలోని లైబ్రరీల్లో అన్ని వసతులు ఉంటాయని వెళ్తుంటారు. కావాల్సిన పేపర్లు, పుస్తకాలు లేకపోతే అసంతృప్తిగా ఉంటుంది. ఉన్నతాధికారులు, నేతలు గ్రంథాలయాలను బలోపేతం చేయాలి.

– నాని, విద్యార్థి

రన్నింగ్ లారీపై నుంచి పడి క్లీనర్ మృతి

పలమనేరు : లారీపైనున్న టార్పాలిన్ పట్టను కడుతూ కాలుజారి కిందపడి క్లీనర్ మృతి చెందిన సంఘటన పలమనేరు మండలంలోని కాలువపల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుంచి లారీ లోడ్‌తో బయలుదేరి తమిళనాడులోని గుడియాత్తంలో అన్‌లోడ్ చేసి తిరిగి బయలు దేరింది. ఈ నేపథ్యంలో మండలంలోని కాలువపల్లి వద్ద వస్తుండగా లారీ అద్దాలకు పైనున్న టార్పాలిన్ అడ్డుగా వస్తోందని గమనించిన డ్రైవర్ ఉస్మాన్ క్లీనర్ మంజునాథ్‌కు చెప్పాడు. దీంతో క్లీనర్ లారీ రన్నింగ్‌లో ఉండగానే దాన్ని తాడుతో కట్టి కిందకు దిగే సమయంలో కాలుజారి కింద పడ్డాడు. పై నుంచి కిందపడిన మంజునాథ్(42) తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ సమీపంలోని కణాడియి గ్రామంగా తెలిసింది. పలమనేరు పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



సీమోను(ఫైల్)

గంగాధరనెల్లూరు : విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కట్టకిందపల్లి హరిజనవాడలోని దినకరన్, మాధవీల మూడో కుమారుడు సూరి అలియాస్ సీమోను (13) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రామంలోని చర్చిలో మైక్‌లో అందరినీ చర్చి ప్రార్థనకు రావాలని పిలుస్తుండగా షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే కింద పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు అతనిని హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సూరి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పుష్పపల్లకిలో ఊరేగిన ఆదిదంపతులు



పుష్పపల్లకిలో ఊరేగుతున్న ఆదిదంపతులు

తవణంపల్లె: కాలభైరేశ్వర ఆలయంలో కొనసాగుతున్న మహా శివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం స్వామికి ఉభయదారులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ధూపదీప నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రిలో పుష్పపల్లకిలో సేవను ఉభయదారులు ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, పట్టువస్త్రాలు, సుగంధ పరిమళ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఉత్సవమూర్తులు అర్చకులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. పుష్పపల్లకిలో కొలువుదీరిన ఆదిదంపతులు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. భక్తులు ఇంటింటా పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థినులకు అభినందన



శిబిరంలో పాల్గొన్న మహిళా వర్సిటీ విద్యార్థినులు

తిరుపతి సిటీ : తమిళనాడు కన్యాకుమారి వివేకానంద కాలేజ్ వేదికగా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ చెన్నై ప్రాంతీయ డైరెక్టరేట్ సంయుక్తంగా గత నెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరం శుక్రవారం ముగిసింది. పలు రాష్ట్రాల ఎన్ఎస్ఎస్ క్యాడెట్లతో సత్సంబంధాలు మెరుగుపరుచుకోవడం, విభిన్న సంస్కృతులపై అవగాహన పెంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా శిబిరం నిర్వహించారు. ఇందులో మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ఆంధ్రప్రదేశ్ కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ యువశ్రీ, వలంటీర్స్ రేణుశ్రీ, పావని, లిఖిత, కామాక్షి, వాణి, శైలజ పాల్గొన్నారు. ఈ శిబిరంలో పలు సేవా దృక్పథంతో కూడిన నైపుణ్యాలను ప్రదర్శించి అధికారుల మన్ననలు పొందారు. వారిని ఆదివారం పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజని, కోఆర్డినేటర్ ఆచార్య విద్యావతి, అధ్యాపకులు అభినందించారు.

నా బిడ్డను బతికించండి

- చేతికందివచ్చిన కొడుకు ఆసుపత్రి పాలు
- మెదడు వ్యాధితో నెలన్నరగా పోరాడుతున్న యువకుడు
- ఆదుకోవాలని ఓ తల్లి వేడుకోలు



చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిరంజీవి

పుత్తూరు : చేతికందివచ్చిన బిడ్డ ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా అగాథంలో కూరుకుపోయింది. బిడ్డ ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ తల్లి పడుతున్న పాట్లు వర్ణనాతీతం. వివరాలు ఇలా.. పుత్తూరు మండలం కేఎం అగ్రహారం గ్రామానికి చెందిన వేలాయుదం ఆచారీ, అంబిక దంపతుల కుమారుడు చిరంజీవి (27), పావని(29) ఇద్దరు సంతానం. పావనికి వివాహం చేసి పంపించారు. వేలాయుదం తిరుమలలో అవుట్ సోర్సింగ్ వడ్రంగి ఉద్యోగిగా పనిచేస్తుండగా, అంబిక అగ్రహారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కగానొక్క కుమారుడు చిరంజీవి(27) జనవరి 17వ తేదీన ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కంగారు పడిన తల్లి కుమారుడిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా వారు ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వలేమని చెప్పడంతో స్విమ్స్‌లో చేర్పించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు మెదడులో రక్తం గడ్డ కట్టిందని, చెన్నైలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. దీంతో చెన్నైలోని విజయా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చిరంజీవికి ఆపరేషన్‌కు సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేశారు. మరో ఆపరేషన్ చేయాలని అందుకు మరో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని ఆదివారం డాక్టర్లు చెప్పడంతో అంబిక దంపతులు నిర్ఘాంత పోయారు. ఉన్న ఇల్లును అమ్మి ఆపరేషన్‌కు నగదు సర్దుబాటు చేశామని, ఇప్పుడు మళ్లీ లక్షలు అవసరం కావడంతో ఆ కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలోకి వెళ్లింది. తమ పరిస్థితిని మీడియా ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నగరి ఎమ్మెల్యే తన బిడ్డను కాపాడాలని వేలాయుద ఆచారీ, అంబిక దంపతులు వేడుకుంటున్నారు. తన కుమారుడు ఇలా ఒక్కసారిగా కుప్పకూలడానికి మూడు రోజుల ముందే భర్త వేలాయుద ఆచారీకి గుండె నొప్పి రావడంతో తిరుపతిలో స్టంట్ వేయించుకొచ్చామని, వెంటనే తన బిడ్డను ఆసుపత్రిలో చేర్పించాల్సి వచ్చిందని అంబిక విలపిస్తూ తెలిపారు. చిరంజీవి ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా ఇలా జరిగిందని, తన బిడ్డను కాపాడాలని బాధిత దంపతులు వేడుకుంటున్నారు.

నాడు పండుగ.. నేడు దండగ

- రైతుకు దూరంగా సేవలు
- రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం
- రైతు ముంగిటకే అందని విత్తనాలు, ఎరువులు
- రేషనలైజేషన్ పేరుతో కూటమి కుట్ర



పెద్దిశెట్టిపల్లి రైతు భరోసా కేంద్రం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతలు ఊరు దాటకుండా విత్తనం నుంచి పంటల విక్రయం వరకు అన్ని రకాలుగా సేవలందించిన రైతు భరోసా కేంద్రాలకు ఉరి వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా అందించే ఎరువులు, పురుగు మందులు, తదితర సేవలను కుదించి ఆర్బీకే వ్యవస్థను నిర్వీర్యం చేసిన సర్కారు తాజాగా రేషనలైజేషన్ పేరుతో వాటికి మంగళం పాడేందుకు కసరత్తు చేస్తోంది.

పట్టణ ప్రాంతాలతో పాటు తీర ప్రాంతాల్లోని వాటిని ఎత్తివేయాలని నిర్ణయానికి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం ఆధారంగా రెండు, మూడింటిని విలీనం చేసి భారీగా కుదించాలని భావిస్తోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు

రైతులు పండించే ధాన్యం దళారుల పాలు కాకుండా ఆర్బీకేల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరను అందజేసే పరిస్థితి ఉండేది. ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికి ఉచిత పంటల బీమా వర్తించేది. పంటలు నష్టానికి గురైన సమయంలో ఎన్యూమరేషన్ నిర్వహించి వీలైనంత త్వరగా రైతులకు పరిహారాన్ని అందజేయడంలో వీటి పాత్ర కీలకంగా ఉండేది. వ్యవసాయ అనుబంధ శాఖలైన పశుసంవర్ధక, సూక్ష్మసేద్యం, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల్లో రాయితీలను పొందాలనుకునే రైతులు ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉండేది. వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఆర్బీకేల పనితీరును పరిశీలించి ప్రశంసించారు.

ఇది గత పరిస్థితి...

పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లోని మండలాల్లోని వరి, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల సాగు అధికంగా ఉంది. గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం పల్లెల నుంచి మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. విత్తనాలు, ఎరువులకు డిమాండ్ అధికంగా ఉండే సందర్భాల్లో బ్లాక్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చేది. దీంతో రైతులు అల్లాడిపోయే వారు. లేకుంటే తమిళనాడుకు పరుగులు పెట్టేవాళ్లు. దీనికి తోడు కల్తీ ఎరువుల కాటేయడంతో తమిళనాడులోని సరిహద్దు ప్రాంతాల వైపే చూసేవాళ్లు.

పెరిగిన సాగు విస్తీర్ణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌బీకే వ్యవస్థను తీసుకురావడంతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మారుమూల గ్రామాల్లోనూ ఆర్బీకేలను ఏర్పాటు చేయడంతో రైతులు గ్రామం దాటకుండానే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందడం, పండించిన పంటను దర్జాగా మద్దతు ధరకు అమ్ముకోవడం సాధ్యమైంది. దీంతో గతంతో పోలిస్తే సాగు విస్తీర్ణం 20 శాతానికి పైగా పెరిగింది.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో..

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ వ్యాప్తంగా ఏటా ఖరీఫ్ సీజన్లో 12 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు, 300 క్వింటాళ్ల వరకు కంది, 600 టన్నుల వరకు జనుములు ఇతరా విత్తనాలను అందించేవారు. అలాగే ఏటా సుమారు 5 వేల టన్నులకుపైగా పైగా ఎరువులను కూడా రైతులకు అందించేవారు. అందుకు సంబంధించి ముందస్తుగా ఏటా సుమారు 1.14 లక్షల మంది రైతుల పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసేవారు. అలాగే భూసార పరీక్షలను నిర్వహించి సూక్ష్మ స్థూల పోషకాలను అంచనా వేసి రైతులకు ఏ పంటలు పండించుకోవాలి.. ఎంత మేర ఎరువులు వేయాలి.. తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పెట్టుబడులు గణనీయంగా ఆదా అవుతుండేవి. ఆర్బీకేల్లో ఉన్న రైతుల వివరాల ఆధారంగా సిబ్బంది పంటల బీమా చేయడంతో పాటు ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోతే వెంటనే పరిహారం అందించే వారు. ఇలా ఆర్బీకేల ద్వారా అందించే సేవలతో పాటు రైతు భరోసా పథకం ద్వారా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు భరోసాను ఇచ్చింది.

గత ప్రభుత్వంలో వ్యవసాయం పండగ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విత్తనాల పంపిణీ నుంచి పంట కొనుగోలు వరకూ ప్రతి దశలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేయూతను అందించడంతో వ్యవసాయం పండగలా సాగింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్బీకేలు రైతు నేస్తాలుగా మారి వ్యవసాయంలో నూతన శకానికి నాంది పలికాయి. 2020 మేలో ప్రారంభించిన ఆర్బీకేలను దశల వారీగా బలోపేతం చేశారు. రైతులు ఊరు దాటకుండా వారికి అవసరమైన భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, తదితర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.





నేడు రైతులకు కష్టం...

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చారు. సేవలను అంతంత మాత్రంగానే అందిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంటల బీమా పథకం, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రీకరణ తదితర పథకాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రైతు సేవా కేంద్రాల సంఖ్యను కూటమి ప్రభుత్వం తగ్గించేందుకు కసరత్తు చేస్తుండడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక యూరియా దొరకని పరిస్థితి ఏర్పడింది. యూరియా కోసం రైతులు మండల ప్రాంతాల్లో బారులు తీరుతున్నారు. వ్యాపారులు సిండికేట్‌తో యూరియాను అధిక రేట్లకు విక్రయించుకుంటున్నారు. దీంతో రైతులు ఇబ్బందికి గురవుతున్నారు. అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.